సాక్షి ఖమ్మం

గురువారం । 31 । జూలై । 2025



అటవీ పార్క్ ఎప్పుడో ?

తెలంగాణ తిరుమలగా పేరున్న జమలాపురంలో అటవీ పార్క్ ఏర్పాటుకు నిధులు మంజూరైనా పనుల్లో కదలిక రావడం లేదు. 8లో



సగానికి తగ్గిన సోలార్..

రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సింగరేణి సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో ఉత్పత్తి సగానికి తగ్గిపోగా ఉద్యోగులను తొలగించారు. 8లో

గరిష్టం / కనిష్టం 34° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

డెయిరీకి మహర్దశ



ఖమ్మం ప్రభుత్వ పాడి పరిశ్రమ(విజయ డెయిరీ)కు మహర్దశ పట్టనుంది. డెయిరీని బలోపేతం చేసేలా సర్కారు అడుగులు వేస్తోంది. పాడి పరిశ్రమ స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించి ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలని నిర్ణయించింది. అంతేగాక మరో చోట 15 ఎకరాల్లో ఇంకో పరిశ్రమను నెలకొల్పే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. కాగా, ప్రస్తుత ప్లాంట్‌ను రూ. 2.35 కోట్లతో అధునికీకరించాలని రాష్ట్ర పాడి పరిశ్రమ శాఖ నిర్ణయించింది. – ఖమ్మంవ్యవసాయం



ఖమ్మం పాడి పరిశ్రమ ప్లాంట్

ఖమ్మం పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రణాళికలు

- వాణిజ్య అవసరాలకు ప్రస్తుత పరిశ్రమ స్థలం..
- తద్వారా విజయ డెయిరీకి ఆర్థిక పరిపుష్టి
- కొత్తగా మరొక నిర్మాణానికి ప్రతిపాదనలు

50 ఏళ్లుగా వెనుకబాటే..

పూర్వపు ఖమ్మం జిల్లాతో పాటు నల్లగొండ జిల్లా కోదాడ, సూర్యాపేట వరకు గల పాల ఉత్పత్తిదారుల, వినియోగదారుల ప్రయోజనాల కోసం 1975 లో నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు నగరంలోని రోటరీనగర్‌లో పదెకరాల స్థలంలో పాడి పరిశ్రమను నెలకొల్పారు. 50 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ డెయిరీ అభివృద్ధిలో వెనకబడి ఉండగా, బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశ్రమను సందర్శించి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర పాడి పరిశ్రమ ఎండీ కె.చంద్రశేఖర్ రెడ్డి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, పరిశ్రమ జనరల్ మేనేజర్, సూపరింటెండెంట్ ఇంజనీర్(సివిల్), ఖమ్మం ప్లాంట్ డిప్యూటీ డైరెక్టర్‌లు సమావేశమై అభివృద్ధిపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

స్థలాన్ని సద్వినియోగం చేసేలా..

ఖమ్మం రోటరీనగర్ ప్రాంతం వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందింది. ఈ ప్రాంతంలో పదెకరాల స్థలంలో విజయ డెయిరీ నడుస్తోంది. ఇందులో ఐదెకరాల వరకు వ్యాపార సముదాయాలు నిర్మిస్తే పరిశ్రమకు ఆర్థిక వనరులు సమకూరుతాయని అధికారులు భావిస్తున్నారు. గతంలో ఈ స్థలాన్ని బస్టాండ్‌కు అప్పగించే అంశం కూడా చర్చకు వచ్చింది. ఇటువంటి పరిస్థితులు నెలకొనడంతో ఈ స్థలాన్ని పరిశ్రమ కు ప్రయోజనం కలిగేలా వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించగా.. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు కూడా సానుకూలంగా స్పందించారు.

అభివృద్ధికి ప్రణాళికలు..

ప్రస్తుత పాడి పరిశ్రమ ఆధునికీకరణకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించగా.. ఈ పనులకు రూ. 2.35 కోట్లు అవసరమని రాష్ట్ర పాడి పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి కలెక్టర్‌కు నివేదించారు. పరిశ్రమ నిర్వహణ, ప్రస్తుత ప్లాంటులో మార్పులు, పలు యంత్రాల ఏర్పాటుతో పాటు సివిల్ పనుల నిర్వహణకు నిధులు అవసరమని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. దీంతో పాల నాణ్యత పెరిగితే వినియోగదారుల నుంచి ఆదరణ కూడా పెరుగుతుందని అధికారులు అంటున్నారు. ఇక డెయిరీలో ఆది నుంచీ తాగు నీటి సమస్య ఉంది. దీంతో ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఖమ్మం కార్పొరేషన్ నుంచి తాగునీరు సరఫరా చేయాలని కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. పరిసర ప్రాంతాల్లో డ్రెయిన్లు సరిగా లేక మురుగునీరు పరిశ్రమ ఆవరణలోకి వస్తుండగా దీని నివారణకు కూడా చర్యలు చేపట్టాలని సూచించారు.

నూతన డెయిరీకి ప్రతిపాదన..

ప్రస్తుతం ఉన్న పాడి పరిశ్రమను కొనసాగిస్తూనే మరో చోట 15 ఎకరాలు పరిశ్రమకు కేటాయించి నూతన డెయిరీని నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ అంశంపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఖమ్మం పరిసర ప్రాంతాల్లో అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు రూపొందించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. దీంతో అదనపు కలెక్టర్ ఖమ్మం ఆర్డీఓతో చర్చించి, పరిశ్రమకు అనువైన స్థలాలను గుర్తించే పనిలో ఉన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధిపై దృష్టి



ఖమ్మం పాడి పరిశ్రమ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందిస్తోంది. కలెక్టర్, రాష్ట్ర పాడి పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్‌తో కూడిన అధికారుల బృందం పరిశ్రమ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పలు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇది ఖమ్మం డెయిరీకి శుభ పరిణామం.

– కె.రవికుమార్, పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ డీడీ

మహిళల పేరిటే పథకాలు

రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ తదితరులు

నేలకొండపల్లి : రాష్ట్రంలో అత్యధిక సంక్షేమ పథకాలను మహిళల పేరిటే అమలు చేస్తున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నేలకొండపల్లి డిగ్రీ కాలేజీలో మొక్కలు నాటారు. ఆ తర్వాత రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ పేదల కష్టాలను చూసిన ప్రభుత్వం.. వారికి భరోసా కల్పించేలా పాలన సాగిస్తోందని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు సున్నా వడ్డీతో రూ.25.65 కోట్లు అందించామని తెలిపారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. జిల్లాలో 19,690 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హత ఉన్న వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో లేదా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, భద్రయ్య, రావెళ్ల కృష్ణారావు, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, పగిళ్ల పృథ్వీ, కడియాల నరేష్, కొమ్మినేని విజయ్‌బాబు, గుండా బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

స్తంభాద్రి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



పవిత్రోత్సవాలను ప్రారంభిస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో 18వ వార్షిక పవిత్రోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం హోమం తదితర పూజలు చేశారు. ఆగస్టు 2వ తేదీన పూర్ణాహుతి కార్యక్రమంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయని అర్చకులు తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జల విద్యుదుత్పత్తి ప్రారంభం

కూసుమంచి : పాలేరులోని మినీ హైడల్ ప్రాజెక్టులో జల విద్యుదుత్పత్తి బుధవారం ప్రారంభమైంది. ప్రాజెక్టులో రెండు యూనిట్లు ఉండగా ప్రస్తుతం ఒక యూనిట్‌కు ట్రయల్‌రన్ నిర్వహించగా అది విజయవంతం అయింది. దీంతో ఆ యూనిట్ ద్వారా విద్యుదుత్పత్తి కొనసాగిస్తున్నారు. ఎడమ కాల్వకు నీటి విడుదల పెంచిన తర్వాత రెండో యూనిట్‌ను ప్రారంభిస్తామని, ఈలోపే ట్రయల్ రన్ చేస్తామని అధికారులు తెలిపారు.

మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి

చింతకాని : రైతులు వ్యవసాయ విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని విద్యుత్ శాఖ ఏస్ఈ శ్రీనివాసాచారి అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరులో బుధవారం నిర్వహించిన పొలంబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొలంబాట ద్వారా వ్యవసాయ విద్యుత్ లైన్లకు సంబంధించిన ఒరిగిన స్తంభాలను సరిచేయడం, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చటం, వేలాడుతున్న వైర్లను సరిచేయడం వంటి పనులు చేపడుతున్నట్లు వివరించారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ తిలక్, ఏఈ చావా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'న్యాస్'లో జిల్లాకు మూడో స్థానం



డీఈఓను అభినందిస్తున్న కేశవరావు, యోగితా రాణా

ఖమ్మం సహకారనగర్ : 2024 – 25 విద్యా సంవత్సరంలో విద్యార్థుల నైపుణ్యానికి సంబంధించి నిర్వహించిన న్యాస్ (నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే–జాతీయ ప్రతిభ పరీక్ష) ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో తృతీయ స్థానం సాధించింది. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో సీఎం సలహాదారు కే.కేశవరావు, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలాస్ తదితరులు అభినందించారు. అలాగే ఉత్తమ బోధన అంశంలో ఎన్నెస్పీ కాలనీ ఉపాధ్యాయులు రాజేష్, ఉమను కూడా అభినందించారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన సీపీ



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ప్రకాష్ నగర్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సీపీ సునీల్‌దత్ బుధవారం సందర్శించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, పనితీరును పరిశీలించారు. వర్షాలతో దెబ్బతిన్న సీసీ కెమెరాలను పునరుద్ధరించాలని సిబ్బందికి సూచించారు. నేరాల నియంత్రణలో కీలకంగా పనిచేస్తున్న సీసీ కెమెరాల ఏర్పాటుపై పోలీస్ స్టేషన్ల వారీగా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

ఆర్ఐ కార్యాలయాల ప్రారంభం

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆధునికీకరించిన సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయాలను సీపీ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఎఆర్ ఏసీపీలు సుశీల్‌సింగ్, నర్సయ్య, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్ నాగుల్ మీరా పాల్గొన్నారు.

సరికొత్త ఆశలు..

జిల్లాలో 189 మంది 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు



ఖమ్మం సహకారనగర్ : డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు ఓపీఎస్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో జిల్లాలోని 189 మందిలో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. కాగా, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ సీపీఎస్ఈయూ), ఎస్ఎం ఓపీఎస్‌ల ఆధ్వర్యంలో పదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై దశల వారీగా ఉద్యమాలు చేశామని, దాని ఫలితంగానే 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరుతోందని సీపీఎస్ నాయకులు అంటున్నారు.

ప్రతి ఉద్యోగికి పెన్షన్ రావాలి



ప్రతి ఉద్యోగికి పెన్షన్ కావాలని తమ యూనియన్ ఎంతో కాలగా ఉద్యమం చేస్తోంది. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కూడా పెన్షన్ కోసం న్యాయ పోరాటం చేశాం. ఆ ఉద్యమాల ఫలితంగానే నేడు ఈ తీర్పు వచ్చింది. తీర్పును స్వాగతిస్తూనే.. ప్రతి ఉద్యోగికి పెన్షన్ అనేది హక్కు కాబట్టి ఆ దిశగా మా పోరాటం కొనసాగనుంది.

– చంద్రకంటి శేఖర్, టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు

ఆనందంగా ఉంది



డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ కల్పించాలని గత 10 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతూనే మరో వైపున న్యాయ పోరాటం కూడా చేశాం. దాని ఫలితమే ప్రస్తుతం వచ్చిన తీర్పు అని అభిప్రాయపడుతున్నా.

– పల్లా రవి, ఎంపీ యూపీఎస్ సదాశివపురం, నేలకొండపల్లి మండలం

భూసేకరణ వేగవంతం చేయాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంఅర్బన్: జిల్లాలో చేపట్టిన కీలక అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు ఖమ్మం రూరల్, అర్బన్ మండలాల్లోని రైతులు అంగీకరించిన స్థలాల్లో పనులు వేగంగా కొనసాగించాలని సూచించారు. భూములు ఇచ్చిన రైతులకు ప్రత్యామ్నాయంగా లేఔట్ ప్లాట్‌లు కేటాయించడమే కాక, వాటిలో అంతర్గత రహదారులు, స్ట్రీట్‌లైట్లు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. లేఔట్‌లో 10 మీటర్ల వెడల్పు గల బ్రిడ్జి నిర్మాణానికి డిజైన్‌ను తుది రూపంలోకి తీసుకురావాలని, హైదరాబాద్‌లోని ప్రైవేట్ లేఔట్ల తరహాలోనే లేఔట్‌ను అభివృద్ధి చేయాలని అన్నారు. పనులన్నింటికీ స్పష్టమైన గడువును నిర్దేశించాలని సూచించారు. జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పనులను వేగంగా పూర్తిచేయాలని అన్నారు. సమావేశంలో నీటి పారుదల శాఖ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, నేషనల్ హైవే మేనేజర్ దివ్య, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కల్పించాలి

ఖమ్మంవైద్యవిభాగం : మెరుగైన సేవలతో ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం కల్పించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు. జిల్లాలో 4 ఏరియా ఆస్పత్రులు, 3 సామాజిక ఆరోగ్య కేంద్రాలు వీవీపీ ద్వారా పని చేస్తున్నాయని చెప్పారు. సత్తుపల్లి, మధిర, కల్లూరు ఏరియా ఆస్పత్రుల నూతన భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. వైద్యుల హాజరు సక్రమంగా ఉండాలని, రెండు రోజుల్లో వైద్యులంతా ఆధార్ ఆధారిత హాజరు యాప్‌లో నమోదు కావాలని సూచించారు. ఆస్పత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ రాజశేఖర్, వైద్యశాఖ ఈఈ ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్ : నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–14, 16, 18, 20, సీనియర్ పురుషులు, మహిళల జట్ల ఎంపికలను బుధవారం నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 170 మంది అథ్లెట్లు పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లనున్నారు. ఎంపికల ప్రక్రియలో అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్, జిల్లా సంఘం బాధ్యులు మందుల వెంకటేశ్వర్లు, ఎండీ. షఫీక్ అహ్మద్, ఎం.సుధాకర్, రవి, కృష్ణయ్య, నక్క వెంకటేశ్వర్లు, ముజాహిద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


షేక్ ఫరీదా

బోనకల్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల ఎంపికల్లో ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న షేక్ ఫరీదా ప్రతిభ చూపింది. ఆమె అండర్–14 జట్టుకు ఎంపికై, వచ్చే నెల 3వ తేదీన వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఆడనున్నట్లు హెచ్‌ఎం భాగ్యలక్ష్మి బుధవారం తెలిపారు. పీడీ నవీద్‌పాషా, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మహిళా డెయిరీని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ పురంధర్

మధిర: ఇందిరా మహిళా డెయిరీని మహిళా సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ పురంధర్ తెలిపారు. మధిర ఐకేపీ కార్యాలయంలో ఇందిరా మహిళా డెయిరీ మొదటి విడత పాడి గేదెల కొనుగోలు లబ్ధిదారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. మొదటి విడతలో ఎస్సీ లబ్ధిదారులకు 80 శాతం సబ్సిడీతో రెండు పాడి గేదెలను అందజేస్తారని, ముర్రా జాతి గేదెలను కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, డీపీఎం శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి ఉమాకుమారి, ఐకేపీ ఏపీఎం సుబ్బారావు, ఏఓ సాయి దీక్షిత్, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు ఉపయోగం

ముదిగొండ: మధ్యలో చదువు మానేసిన వారికి ఉన్నత చదువుల కోసం ఓపెన్ స్కూల్ మంచి అవకాశమని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు అన్నారు. ముదిగొండలో బుధవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందేందుకు 80084 03522 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, భాస్కర్‌రావు, డి.శోభారాణి, నాజర్, పాల్గొన్నారు.

సావనీర్ ఆవిష్కరణ


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: నెలనెలా వెన్నెల 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆగస్టు 7 నుంచి 10వ తేదీ వరకు తెలుగు రాష్ట్రాలస్థాయి ఆహ్వాన నాటిక పోటీలను నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి, మిత్రా ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి ఏఎస్‌కుమార్ తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నెలనెలా వెన్నెల వార్షికోత్సవ సావనీర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నెల నెలా వెన్నెల నిర్వాహకులు మోటమర్రి జగన్మోహన్‌రావు, కొత్తూరు దేవేంద్ర, వేల్పుల విజేత, వేముల సదానందం, నందిగం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి జైలు శిక్ష

ఖమ్మంలీగల్: యాదాద్రి భువనగిరి జిల్లా జమ్మాపూర్ గ్రామానికి చెందిన బంధనాథము సాగర్‌కు అజాగ్రత్తగా వాహనం నడిపి వ్యక్తి మరణానికి కారణమైన కేసులో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ స్థానిక స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి బి.నాగలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు. ఫిర్యాది మాతంగి వెంకటేష్.. తన తమ్ముడు నరేశ్ (22) 2018, మార్చి 29న మోటార్ సైకిల్‌పై పాలేరు వస్తుండగా డీసీఎం ఢీకొట్టింది. నరేశ్‌ను ఆస్పత్రిలో చేర్పించగా మరునాడు మృతిచెందాడు. కూసుమంచి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు డీసీఎం డ్రైవర్ సాగర్‌పై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణ అనంతరం నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ వీరయ్య వాదించగా లైజన్ ఆఫీసర్ శ్రీకాంత్, నాగేశ్వరరావు కోర్టు పీసీ భార్గవ్ సహకరించారు.

యూటీ నిర్మాణ పనుల పరిశీలన

కూసుమంచి: సాగర్ ఎడమ కాలువకు పాలేరు వద్ద నిర్మిస్తున్న యూటీ పనులు తుది దశకు చేరగా బుధవారం నీటిపారుదల శాఖ ఎస్‌ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లుతో పాటు క్వాలిటీ కంట్రోల్ ఈఈ వెంకటరమణా రావు, ఇతర అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం కాలువకు 2,600 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతుండగా యూటీ ప్రాంతంలో పరిస్థితిని సమీక్షించారు. కాలువకు నీటి విడుదల పెంపుతో కలిగే ఇబ్బందులపై చర్చించారు. కార్యక్రమంలో డీఈఈ మాధవి పాల్గొన్నారు.

అటవీ పార్క్ ఎప్పుడవుతుందో..?


జమలాపురంలో అటవీ పార్కు నిర్మించనున్న గుట్ట ప్రదేశం

- జమలాపురంలో కదలిక లేని పనులు
- నిధులు మంజూరైనా పనుల్లో జాప్యం
- పర్యాటక అభివృద్ధి అవకాశాలపై పట్టింపు కరువు

ఎర్రుపాలెం: మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిధుల మంజూరులో వేగం చూపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో పనులు అంతే వేగంగా జరగడం లేదు. ఫలితంగా అధికార యంత్రాంగం తీరుపై ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. తెలంగాణ తిరుమలగా పేరున్న ఎర్రుపాలెం మండలంలోని జమలాపురంను పర్యాటక రంగంలోనూ అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం డిప్యూటీ సీఎం అటవీ పార్క్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినా పనుల్లో కదలిక లేక శిలాఫలకం అధికారుల తీరుకు నిదర్శనంగా నిలుస్తోంది.

రూ.5.83 కోట్లు.. జనవరిలో శంకుస్థాపన

శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయం కొలువైన జమలాపురం గ్రామంలో పర్యాటక అభివృద్ధి కోసం అడవులు, గుట్టల ఆధారంగా ఎకో అటవీ పార్కు నిర్మాణానికి (పర్యావరణ ఉద్యానవనం) కార్యాచరణ రూపొందించారు. రూ.5.83 కోట్ల నిధులు మంజూరు కాగా, డిప్యూటీ సీఎం భట్టి జనవరి 7న శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పనులు నత్తనడకన సాగుతున్నాయి. అడవులను ధ్వంసం చేయకుండా, వీటి ఆధారంగా కాటేజీల నిర్మాణం.. తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోగా.. ఆరు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కానీ, ఆ గడువు ముగిసినా అడుగు ముందుకు పడకపోవడం గమనార్హం.

చేపట్టాల్సిన పనులు ఇవే..

అటవీ పార్కు నిర్మాణంలో భాగంగా అధికారులు పలు అభివృద్ధి పనులను చేపట్టాల్సి ఉంది. గుట్ట కింద మొత్తం ఐదు టాయిలెట్ల నిర్మాణం, గుట్టపైన ఉన్న శ్రీవారి పాదాల వరకు రహదారి మార్గం ఏర్పాటు చేయాలి. అలాగే, గుట్టపైకి దారితో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు, సైడ్ వాల్స్ నిర్మాణం పనులు, టూరిస్టులు విడిది చేసేందుకు గానూ మూడు కాటేజీలు నిర్మించాల్సి ఉంది. అంతేకాక గుట్టపై పర్యాటకుల కోసం పార్కుల ఏర్పాటు, టూరిస్టులు ఒకేచోట సేద తీరడం, కూర్చునేందుకు హట్స్ నిర్మించాల్సి ఉంది.

పార్క్ సిద్ధమైతే పర్యాటకుల తాకిడి



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి అన్ని ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు. అటవీ పార్కు పూర్తయితే పర్యాటకుల తాకిడి మరింతగా పెరిగే అవకాశాలున్నాయి. ఆదాయ మార్గాలుంటాయి. యువతకు ఉపాధి కూడా ఉంటుంది. గుట్టపైన కాటేజీల నిర్మాణంతో టూరిస్టులు విడిది చేయడానికి కూడా మొగ్గు చూపుతారు. గుట్టపైన శ్రీవారి పాదాల వద్దకు కూడా భక్తులు వెళ్లి సందర్శించి పూజలు నిర్వహిస్తున్నారు.

–ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, వ్యవస్థాపక ధర్మకర్త, జమలాపురం ఆలయం

గుట్ట కింద పనులు చేస్తున్నాం..



జమలాపురంలో శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవాలయం సమీపంలో 4,5 హెక్టార్లల్లో అటవీ పార్కు పనులు మొదలుపెట్టాం. ఇప్పటికే టాయ్‌లెట్ల పనులు జరుగుతున్నాయి. గుట్ట కింద ఎర్త్ పనులు కూడా చేస్తున్నాం. నిధులు మంజూరైనప్పటికీ ఇంకా కాంట్రాక్టర్‌కు అసలు బిల్లులు రాలేదు. ఈ కారణంగా పనులు మందకొడిగా నడుస్తున్నాయి. బిల్లులు సకాలంలో వస్తే పనులు వేగం పుంజుకుంటాయి.

–శ్రీనివాసరెడ్డి, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, మధిర

గురుకుల కార్యదర్శికి నిరసన సెగ

కారుకు అడ్డుపడి ఆందోళన చేసిన విద్యార్థి సంఘాల నేతలు


అంబేడ్కర్ కళాశాల ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా పర్యటనలో భాగంగా ఖమ్మం వచ్చిన సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణికి వామపక్ష విద్యార్థి సంఘాల నుంచి నిరసన సెగ ఎదురైంది. బుధవారం ఖమ్మంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆమెకు వినతిపత్రం అందించేందుకు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ సంఘాల నేతలు కళాశాల వద్దకు చేరుకున్నారు. వారిని కలిసేందుకు నిరాకరించడంతో గురుకులాల కార్యదర్శి కారును కళాశాల లోకి వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో స్థానిక అధికారులు మెయిన్ గేటు నుంచి కాకుండా పక్కనున్న గేటు ద్వారా లోనికి తీసుకెళ్లగా ఆగ్రహించిన విద్యార్థి సంఘాల నేతలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. అంబేడ్కర్ కళాశాలలో కార్యక్రమం ముగించుకొని దానవాయిగూడెం గురుకులం వద్దకు వెళ్లిన విషయం తెలుసుకుని అక్కడా వినతి పత్రం ఇచ్చేందుకు యత్నించారు. కార్యదర్శి కారుకు అడ్డుపడి ఆందోళన చేశారు. ఆందోళన ఉధృతం అవుతుండగా పోలీసులు చేరుకొని వారిని పక్కకు తప్పించే ప్రయత్నం చేశారు. సమస్యలు వింటేనే ఆందోళన విరమిస్తామని సంఘాల నేతలు పట్టుబట్టడంతో పోలీసులు జోక్యం చేసుకొని గురుకుల కార్యదర్శికి వినతి పత్రం అందజేయించారు. సమస్యలు వినకుండా గురుకుల కార్యదర్శి వ్యవహరించిన తీరుపై విద్యార్థి సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వినలేని గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణిని సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అనంతరం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవనంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, టి.ప్రవీణ్‌కుమార్, వి.వెంకటేశ్, ఎం.సురేశ్, జి.మస్తాన్ మాట్లాడారు. తొలి నుంచి గురుకుల కార్యదర్శి అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని, ఓ సందర్భంలో విద్యార్థులు బాత్‌రూమ్‌లు కడుక్కోలేరా అని మాట్లాడారని, ఇప్పుడు విద్యార్థుల సమస్యలను వివరించేందుకు వెళ్లిన తమతో మాట్లాడేందుకు నిరాకరించారని పేర్కొన్నారు. సమావేశంలో సుధాకర్, త్రినాథ్, మనోజ్, అజయ్, లోకేశ్, వెంకటేశ్, జంపన్న, వరుణ్, వెంకట్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడక్రాస్‌రోడ్‌లోని టీజీఎస్‌ఈడబ్ల్యూఆర్ఎస్‌ను గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి బుధవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులను పలు సబ్జెక్టులపై ప్రశ్నించారు. పరిశుభ్రత, భోజనం ఎలా ఉందని ఆరా తీశారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఒకరు మృతి

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం – వెంకటాపురం గ్రామాల మధ్య ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీ రాష్ట్రం మైలవరం పట్టణానికి చెందిన కంచన శేఖర్ జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ట్రాక్టర్‌కు పూజ ఉండగా.. ద్విచక్రవాహనంపై వచ్చి తిరిగి వస్తున్నాడు. కాగా, కుమారుడు ఏడుస్తున్నాడని, తిరిగి రావాలని భార్య ఫోన్ చేయడంతో వెంకటాపురం వరకు వచ్చిన శేఖర్ జమలాపురం వైపు వస్తుండగా ఏపీ రాష్ట్రం కొండపల్లి గ్రామానికి చెందిన పులి బలరాం తన బొలెరో వాహనంతో ఢీకొట్టాడు. దీంతో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ రమేశ్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు

విద్యార్థులు లక్ష్యం దిశగా సాగాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న శ్రీజ

చింతకాని: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా ముందుకు సాగాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. టాయిలెట్లు, తాగునీటి వసతి, వంటగది, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి పర్వీన్ ఖైసర్, ఎంఈఓ సలాది రామారావు, ఏఈ రఘు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 9 నుంచి రైలు యాత్ర

ఖమ్మంమామిళ్లగూడెం: గుర్తింపు పొందిన ఇండియన్ రైల్వేస్, భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు, సౌత్ స్టార్ రైల్ ఆధ్వర్యంలో మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష క్షేత్ర యాత్ర రైలు సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ఇండియన్ రైల్వేస్ సౌత్‌స్టార్ రైల్ టూర్ టైమ్స్ డైరెక్టర్ జి.విఘ్నేశ్ తెలిపారు. బుధవారం దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్లగొండ, హైదరాబాద్, కాజీపేట స్టేషన్లలో యాత్రికులు రైలు ఎక్కే వీలుందని తెలిపారు. యాత్రలో ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ద్వారకా, సిద్ధాపూర్, మధుర, అయోధ్య, ప్రయాగ్‌రాజ్, వారణాసి, గయ వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లొచ్చని చెప్పారు. కార్యక్రమంలో టూర్ టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ.. ఈ ప్యాకేజీపై ఇండియన్ రైల్వే 33 శాతం సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. థర్డ్ ఏసీ (కంఫర్ట్) రూ.45,750లు, సెకండ్ ఏసీ (డీలక్స్) రూ.54,100లు, ఫస్ట్ ఏసీ (లగ్జరీ) రూ.69,500లు అని పేర్కొన్నారు. టికెట్లను 93550 21516 నంబర్‌కు కాల్ చేసి బుక్ చేసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 98483 43882, 63030 93338 నంబర్లలో సంప్రదించాలని కోరారు. యాకేశ్ పాల్గొన్నారు.

ఆశ్రమంలోని వృద్ధురాలు మృతి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీరాంనగర్‌లోని ఓ ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న మునీషాబేగం (60) పిట్స్‌తో కిందపడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ ఘటనపై ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

వేధింపులపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: యువతిని వేధిస్తున్న యువకుడిపై బుధవారం ఖమ్మంఅర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. తన క్లాస్‌మేట్ అయిన యువతిని ఎ.పవన్‌కల్యాణ్ అనే వ్యక్తి వేధిస్తుండటంతో సదరు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భానుప్రకాష్ తెలిపారు.

సంతాన సాఫల్య కేంద్రాల తీరుపై కలెక్టర్ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో విచ్చలవిడిగా సంతాన సాఫల్య కేంద్రాలు పుట్టుకొస్తున్నాయి. మంగళవారం సాక్షిలో 'దంపతులతో దాగుడు మూతలు' కథనం ప్రచురితమైంది. దీంతో కలెక్టర్ అనుదీప్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో డీఎంహెచ్‌ఓ కళావతి బాయి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లపై దాడులు చేయాలని నిర్ణయించారు. గురువారం నుంచి తనిఖీలు ప్రారంభిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. సంతాన సాఫల్య కేంద్రాలు అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) యాక్ట్ 2021, సరోగసీ (రెగ్యులేషన్) చట్టం 2021 ప్రకారం చట్ట నియమాలు, నిబంధనలు పాటించాలని ఆదేశించారు.

హామీల అమలులో విఫలం


మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

తల్లాడ: రాష్ట్రంలో వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అమలు చేయటంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. తల్లాడ జీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో మోరంపూడి పాండు అధ్యక్షతన జరిగిన సత్తుపల్లి డివిజన్ కమిటీ ప్లీనరీలో తమ్మినేని ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు జరిగిన సభల్లో కాంగ్రెస్ వస్తే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని చెప్పి.. ప్రస్తుతం గత ప్రభుత్వం చేసిన అప్పులను ప్రస్తావిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికల వరకే మభ్యపెట్టి ఆ తర్వాత ప్రస్తుతం అమలు చేస్తున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎత్తి వేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ ఓట్ల రాజకీయం చేస్తోందని తెలిపారు. సమావేశంలో పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వర్‌రావు, తాతా భాస్కర్‌రావు, మాచర్ల భారతి, మాదినేని రమేశ్, చలమాల విఠల్‌రావు, శీలం సత్యనారాయణరెడ్డి, ఐనాల రామలింగేశ్వర్‌రావు, జాజిరి శ్రీనివాసరావు, మాదాల వెంకటేశ్వర్‌రావు, తన్నీరు కృష్ణార్జున్ పాల్గొన్నారు.

నాలుగు నెలల తర్వాత కుటుంబం చెంతకు..


సీఐ బాలకృష్ణ సమక్షంలో అప్పగిస్తున్న అన్నం శ్రీనివాసరావు

ఖమ్మంక్రైం: నాలుగు నెలల కిందట తప్పిపోయిన ఓ వ్యక్తిని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గత ఏప్రిల్ 17న విజయవాడ నుంచి ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలలో బంధువులను చూడటానికి వచ్చిన రవికుమార్.. మతిస్థిమితం కోల్పోయి పోస్నికల్ పరిసరాల్లో తిరుగుతుండగా.. మాలోత్ మున్నానాయక్ కుటుంబ సభ్యులు చేరదీశారు. అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావుకు సమాచారం అందించగా ఆయన తన ఆశ్రమానికి తీసుకొచ్చి వివరాలు సేకరించారు. టూటౌన్ పోలీసుల సమాచారంతో విజయవాడలోని అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు ఖమ్మం వచ్చారు. వారికి రవికుమార్ సీఐ బాలకృష్ణ సమక్షంలో అప్పగించారు.

వ్యక్తి ఆత్మహత్య

సత్తుపల్లి: మండలంలోని రుద్రాక్షపల్లి తోగులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. దమ్మపేట మండలం మందలపల్లి గ్రామానికి చెందిన పలాటి రమేశ్ (45) మద్యానికి బానిస అయ్యాడు. మూడురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కాగా, రుద్రాక్షపల్లి తోగువాగులో గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యులు గుర్తించటంతో ఆత్మహత్యగా ఎస్‌ఐ ప్రదీప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిన్నర్ ఆయిల్ పట్టివేత

తల్లాడ: తల్లాడ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2 లక్షల విలువైన టిన్నర్ ఆయిల్‌ను ఎస్‌ఐ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. ఒక షెడ్డులో నిల్వ ఉంచిన పది టిన్నర్ ఆయిల్ డబ్బాలను (2 వేల లీటర్లు) స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిల్వ చేసిన మనోజ్‌కుమార్‌శర్మపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సగానికి తగ్గిన సోలార్ విద్యుత్ ఉత్పత్తి

అంతా అస్తవ్యస్తంగా మారిన ఇల్లెందు ఏరియా సింగరేణి


సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లేట్లు

ఇల్లెందు: రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన సింగరేణి సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి సగానికి తగ్గిపోయింది. ప్లాంట్‌లో పనిచేసే మూడు విభాగాల్లోని ఉద్యోగులు, కార్మికులను తొలగించా రు. సోలార్ ప్లాంట్ నిర్వహణ అధ్వానంగా మారింది. ఇక్కడి సైట్ ఇంజనీర్ వెంకటేశ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెంది 8 నెలలు కావొస్తుండగా ఆయన స్థానంలో మరో సైట్ ఇంజనీర్‌ను భర్తీ చేయలేదు. నిర్వహణ బాధ్యతలు చూసే సూపర్‌వైజర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఈనెల మొదటి వారం నుంచి కార్మికులు పనుల్లోకి వెళ్లటం లేదు. తమకు న్యాయం చేయాలని సమ్మెబాట పట్టారు. దీంతో ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి సగానికి పడిపోయింది. ఇల్లెందు – కారేపల్లిరోడ్‌లో కోటమైసమ్మ ఆలయం సమీపంలో 350 ఎకరాల్లో ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ ప్లాంట్ నిర్వహణ టెండర్‌ను ఓ సంస్థ దక్కించుకుంది. ప్లాంట్ రక్షణ కోసం 30 మంది వరకు గార్డులు పనిచేయాలి. కానీ, తొమ్మిది మంది గార్డులను కొనసాగిస్తామని చెప్పటంతో గార్డులు సమ్మె బాట పట్టారు. ఇక ఆరుగురు ఎలక్ట్రీషియన్లు, 10 మంది గ్రాస్ కట్టింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. నిర్వహణ భారంగా మారిందని కార్మికులను తొలగించారు. తొమ్మిదిమంది గార్డులను కొనసాగిస్తూ రాత్రుల్లో చోరీల అదుపుకోసం విధులకు హాజరు కావాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇదిలాఉండగా ఇక్కడి సీసీ కెమెరాలు కూడా సక్రమంగా పనిచేయటంలేదు. దీంతో చోరీలు పెరిగిపోయా యి. కాగా, రాత్రి సమయాల్లో తాము ఎంతకాలం విధులు నిర్వర్తించాలని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. జూలై మొదటి వారం నుంచి విద్యుత్ ఉత్పత్తి సగానికి సగం తగ్గిపోయింది. ప్రతీ రోజు 1.50 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగాల్సి ఉండగా సగం కూడా ఉత్పత్తి జరగడం లేదని అధికారులే చెబుతున్నారు. ఈ తరుణంలో రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన సింగరేణి సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి నీటి మీద రాతలుగా మారింది. ఈ అంశంపై సింగరేణి సోలార్ ప్లాంట్ పర్యవేక్షక ఇంజనీర్ వీరూనాయక్‌ను వివరణ కోరగా సంస్థ నిర్వహణ లోపం వల్ల విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదని, ఇది సంస్థ లోపమే తప్ప సింగరేణి లోపం కాదని పేర్కొన్నారు. విద్యు త్ ఉత్పత్తి తగ్గిపోయిన విషయం వాస్తవమేనని, కొన్ని ప్లేట్లు పని చేయడం లేదని, చాలా సమస్యలు ఉన్నాయని, మరో సంస్థకు టెండర్ అప్పగించే ప్రయత్నంలో కొంత జాప్యం సాగుతోందని పేర్కొన్నారు.

జీవనోపాధికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..

లోక్ సభలో మూడు ప్రశ్నలు అడిగిన ఎంపీ రఘురాంరెడ్డి


లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: బొగ్గు గనులు మూసేసిన ప్రాంతాల్లో అక్కడ నివసిస్తున్న ప్రజల జీవనోపాధికి ఏం చర్యలు చేపడుతున్నారు..? అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా బుధవారం ఎంపీ మూడు ప్రశ్నలు అడిగారు. బొగ్గు గనులకు సంబంధించి జస్ట్ ట్రాన్సిషన్ పనితీరును మెరుగుపరచడానికి తీసుకున్న చర్యలు, మరో రెండు ప్రశ్నల్లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల వివరాలు, జాతీయ ఆహార భద్రతా చట్టం అమలు తీరు, రేషన్ కార్డుల జారీ వివరాలు కోరారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి, విద్యుత్, కొత్త పునరుత్పాదక ఇంధనం శాఖల సహాయ మంత్రి శ్రీపాద్ యశోనాయక్, కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖల సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్‌బాంభణియా లిఖితపూర్వక సమాధానాలు ఇచ్చారు. ఈ ఏడాది జనవరి 31న జారీ చేసిన మైనింగ్ ప్లాన్ గనుల మూసివేత మార్గదర్శకాల ప్రకారం.. ప్రభావిత కుటుంబాల కోసం పునరావాస చర్యలు చేపడుతున్నామని జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శ్రీపాద్‌యశోనాయక్ మాట్లాడుతూ.. పునరుత్పాదక ఇంధన అమలు సంస్థలు (ఆర్‌ఈఐఏస్) జారీ చేసిన టెండర్లకు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈసీఐ), ఎన్‌టీపీసీ తదితర సంస్థలతో కలుపుకుని ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి 43,922 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం కలిగి ఉన్నట్లు చెప్పారు. విద్యుత్ అమ్మకపు ఒప్పందా (పీఎస్ఏఎస్)లను కేంద్రం వేగవంతం చేసిందన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం అమలు తీరుపై కేంద్ర సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభణియా సమాధానం ఇస్తూ.. గ్రామీణ ప్రాంతాల్లో 75 శాతం, పట్టణ ప్రాంతాల్లో 50 శాతం వరకు జనాభా ఆహార అవసరాలను తీర్చడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

బోనకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎరువుల దుకాణాలను డీఏఓ ధనసరి పుల్లయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహకార సంఘాలల్లో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు. ఎరువుల డీలర్లు స్టాక్ బోర్డు తప్పని సరిగా నిర్వహించాలన్నారు. డీలర్లు ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించవద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని సూచించారు. అనంతరం గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించారు కార్యక్రమంలో ఏడీఏ స్వర్ణ విజయచంద్ర, ఏఓ పి. వినయ్ కుమార్ పాల్గొన్నారు.